సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 5 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.24,160

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,160, కనిష్టంగా రూ.6 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.8

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది.



న్యూస్‌రీల్

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు రైతులకు వివరించి జిల్లాలో విస్తీర్ణం పెరిగేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. ఊరూరా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. మంగళవారం స్థానిక సాయి ఆరామంలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం -ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం'పై జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ... రైతు సేవా కేంద్రాల పరిధిలోని మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రైతులకు పెట్టుబడి తగ్గించి ఆదాయం చేకూరే విధంగా సహకారాన్ని అందించాలన్నారు. జిల్లాలోని బీడు భూముల్లో ప్రకృతి వ్యవసాయ విధానాల్లో రైతులు పంటలు సాగు చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావ్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎం లక్ష్మానాయక్, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన ఎండుమిర్చి ధర



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర కాస్త తగ్గింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 82.40 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా, అధికారులు ఈ-నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఇందులో మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ. 13 వేలు, రెండో రకం రూ.8 వేలు, మూడో రకం రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. గత వారంతో పోలిస్తే క్వింటాపై ఎండుమిర్చి రూ.1,200 మేర తగ్గింది.

నెలాఖరు వరకూ ఆ ప్యాసింజర్ రైళ్లు తిరగవ్!

గుంతకల్లు: కుంభమేళాకి వెళ్లిన ప్యాసింజర్ రైళ్లు తిరిగి గుంతకల్లు డివిజన్ చేరుకునేందుకు ఈ నెలాఖరు వరకూ సమయం పడుతుందని డివిజన్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తిరుపతి-కదిరిదేవరపల్లి (57405) ప్యాసింజర్ రద్దును ఈ నెల 30 వరకూ పొడిగించినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కదిరిదేవరపల్లి-తిరుపతి (57406) ప్యాసింజర్‌ను ఈ నెల 31 వరకు, గుంతకల్లు-తిరుపతి (57404) ప్యాసింజర్ 30 వరకు, తిరుపతి-గుంతకల్లు (57403) ప్యాసింజర్ ఈ నెల 31 వరకు తిరగవన్నారు. తిరుపతి-హుబ్లీ (57401) ప్యాసింజర్‌ను ఈ నెల 15 వరకు, హుబ్లీ-తిరుపతి ప్యాసింజర్ రద్దును ఈ నెల 16 వరకూ పొడిగించినట్లు వెల్లడించారు.

ఆకలితో ఉన్నాం.. పచ్చడి మెతుకులు పెట్టమంటే... ఆర్నెల్లు ఆగు బిర్యానీ పెడతానన్నట్లుగా ఉంది కూటమి సర్కార్ తీరు. గ్రామంలో ఇంటికి సమీపంలో ఉన్న పాఠశాలల్లో సాకర్యాలు కల్పించమని అడుగుతుంటే...పంచాయతీకో 'మోడల్ ప్రైమరీ స్కూల్' అంటూ అరచేతిలో వైకుంఠం చూపుతోంది. 50 మందిలోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసేందుకు సిద్ధమైంది. అదే జరిగితే ఆయా గ్రామాల్లోని విద్యార్థులు చదువుకునేందుకు కి.మీ దూరంలోని పాఠశాలకు రోజూ పాదయాత్ర చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.



విలీనం.. విద్యార్థికి శాపం!

బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి పంచాయతీ పరిధిలోని జానకంపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 21 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఇద్దరు టీచర్లు ఉన్నారు. ప్రభుత్వం 'మోడల్ ప్రైమరీ స్కూళ్ల' ఏర్పాటుకు సిద్ధం కాగా, నిబంధనల మేరకు 50 మందికిపైగా విద్యార్థులున్న బుచ్చయ్యగారిపల్లి పాఠశాలను 'మోడల్ స్కూల్'గా మారుస్తారు. అంతేకాకుండా జానకంపల్లి ప్రాథమిక పాఠశాలను 'మోడల్'లో విలీనం చేస్తారు. దీంతో ప్రస్తుతం జానకంపల్లి స్కూల్లో ఉన్న విద్యార్థులు 4 కి.మీ దూరంలోని బుచ్చయ్యగారిపల్లి 'మోడల్ స్కూల్'కు నడిచి వెళ్లాలి. లేదా బుక్కపట్నంలోని పాఠశాలకు వెళ్లాల్సి ఉంటుంది.

- చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దలలో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేస్తే ఆ పంచాయతీలోని హరియాన్‌చెరువు, చిన్నపల్లి పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. ఆయా పాఠశాలల్లోని విద్యార్థులు 2 నుంచి 4 కిలోమీటర్ల మేర దూరం నడుచుకుంటూ న్యామద్దలకు రావాల్సి వస్తుంది.

... ఇలా 'మోడల్ ప్రైమరీ' స్కూళ్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు మూసివేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. ప్రభుత్వం అనుకున్న ప్రకారం జరిగితే నిరుపేద విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారనుంది.



పాఠశాల విలీనానికి వ్యతిరేకంగా చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో ఈనెల 1వ తేదీన ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు పేరుతో స్కూళ్ల కుదింపు

- పంచాయతీల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విలీనం
- జిల్లాలో 1,527 ప్రాథమిక పాఠశాలల మూత?
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

226 జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలు

15,465 మంది ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

1,527 ప్రాథమిక పాఠశాలలు

41,524 ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు

పుట్టపర్తి: వైఎస్ జగన్ సర్కార్ 'నాడు- నేడు'తో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దితే...కూటమి సర్కార్ ప్రభుత్వ పాఠశాలల మూతకు రంగం సిద్ధం చేస్తోంది. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు పేరుతో పంచాయతీలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను మూసి వేసేందుకు కుట్ర పన్నుతోంది. ఇప్పటికే దీనిపై ప్రభుత్వం పెద్ద ఎత్తున కసరత్తు ప్రారంభించింది. జిల్లాలో మోడల్ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తే 1,527 ప్రైమరీ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం కానుంది.

పేద విద్యార్థులకు చదువు దూరం చేసే కుట్ర

వైఎస్ జగన్ ప్రభుత్వం పేద విద్యార్థులు ప్రభుత్వ బడులలో చదివేందుకు పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు అందించింది. పాఠశాలలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టింది. అంతేకాకుండా 'జగనన్న విద్యాకానుక' పేరుతో నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బ్యాగ్, షూ, టై తదితర వాటినన్నీ అందించింది. అలాగే 'జగనన్న అమ్మఒడి' పేరుతో ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తూ పేదింట చదువుల వెలుగులు ప్రసరించేలా చేసింది. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'డ్రాపౌట్'ల సంఖ్య భారీగా తగ్గింది. కానీ కూటమి సర్కార్ అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తూ ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసేందుకు సిద్ధమైంది. ఇందుకోసం మోడల్ ప్రైమరీ పాఠశాలలు అంటూ కొత్త ఎత్తుగడ వేసింది. పంచాయతీకో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేస్తే జిల్లాలో 1,527 ప్రైమరీ స్కూళ్లపై తీవ్ర ప్రభావం చూపనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పాఠశాలలకు తాళం తప్పదా?

పంచాయతీకో మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటు చేయటం వల్ల ఆయా పంచాయతీల్లోని మిగిలిన పాఠశాలలు మూతపడనున్నాయి. ఇప్పటికే ఈ మేరకు విద్యాశాఖ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఓ పంచాయతీ పరిధిలో రెండు, మూడు గ్రామాలు ఉంటాయి. పంచాయతీ కేంద్రానికి ఆయా గ్రామాలకు కనీసంగా 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అందువల్లే గత ప్రభుత్వాలు ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేశాయి. కానీ కూటమి ప్రభుత్వం 'మోడల్ ప్రైమరీ పాఠశాల' పేరుతో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను మూసివేసేందుకు సిద్ధమైంది.

బలవంతంగా తీర్మానాలు

మోడల్ ప్రైమరీ స్కూళ్ల ఏర్పాటు కోసం మిగిలిన పాఠశాలల్లోని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో బలవంతంగా తీర్మానాలు చేయించుకునే కార్యక్రమానికి విద్యాశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఇలా చేయటం వల్ల విద్యార్థులు మైళ్ల దూరం నడిచి ఇతర గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలల విలీనానికి వ్యతిరేకంగా ఇప్పటికే జిల్లాలోని చెన్నేకొత్తపల్లి మండలం న్యామద్దెలలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. విలీనం చేయొద్దని పాఠశాల ముందు నినాదాలు చేశారు.

విలీనం చేయొద్దు



కూటమి ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ విధానానికి స్వస్తి చెప్పకపోతే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుంది. పంచాయతీకో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు వల్ల 50 మందిలోపు విద్యార్థులున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు మూతపడతాయి. అలా కాకుండా 50 మంది విద్యార్థులకంటే అధికంగా ఉన్న అన్ని పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మార్చాలి.
– పీపీ రమణారెడ్డి, వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు

ఉద్యమం తప్పదు



ప్రభుత్వం పంచాయతీకో మోడల్ స్కూల్ ఏర్పాటు చేసే ప్రతిపాదన విరమించుకోకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం. మోడల్ స్కూళ్ల ఏర్పాటు పేరుతో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు, విద్యార్థుల తల్లిదండ్రులతో బలవంతంగా తీర్మానాలు చేయించటం సరైంది కాదు. విద్యార్థుల ఇబ్బందులు పట్టించుకోకుండా ప్రభుత్వం మొండిగా పాఠశాలల విలీనంపై ముందుకు వెళితే ఆందోళన తీవ్రతరం చేస్తాం. – శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వైఎస్సార్ సీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి

- జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: బీసీ అంటే బ్యాక్ వర్డ్ కాదని, బ్యాక్‌బోన్ అని చాటిచెప్పిన నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మంగళవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత టీడీపీ అధినేత వద్ద మార్కులు కొట్టేసేందుకు బీసీలను తామేదో ఉద్ధరించినట్లు అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం... బీసీలకు ఇస్త్రీ పెట్టెలు, కత్తెర పెట్టెలు తాయిలాలుగా ఇస్తే, బీసీల ఆత్మబంధువు వైఎస్ జగన్ మాత్రం అన్ని రంగాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించి పాలనలో భాగస్వాములను చేశారని ఉషశ్రీ గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన కేబినెట్‌లో 11 మంది బీసీలకు అవకాశమిచ్చారని, 56 బీసీ కార్పొరేషన్లతో పాటు అనేక కమిటీల్లో బీసీలకు 50 శాతం పదవులు ఇచ్చి మేలు చేశారన్నారు. అలాగే చేనేతలకు ఏడాదికి రూ. 24 వేల ఆర్థిక సాయం అందించి ఆదుకున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వీటన్నింటినీ విస్మరించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం ఏదో చేసినట్లు గొప్పలు చెప్పడం చూసి జనం నవ్వుతున్నారన్నారు. మంత్రికి నిజంగా ధైర్యం ఉంటే బీసీలకు ఏ ప్రభుత్వంలో మంచి జరిగిందో చెప్పేందుకు బహిరంగ చర్చకు రావాలన్నారు.

బీసీలకిచ్చిన హామీలేమయ్యాయి సవిత?

మంత్రి సవితకు బీసీల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇప్పించాలన్నారు. అలాగే కురుబ గుడికట్లు పూజారులకు నెలకు రూ.5 వేల వేతనం ఇప్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. కనీసం పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి కాటన్ మిల్లు మూతపడకుండా చూసి బీసీలకు ఉపాధి కల్పించాలన్నారు. మంత్రి సవిత నిజంగా బీసీల అభివృద్ధి, మంచిని కాంక్షిస్తే ఆమె మంత్రి భర్త బీసీల్లో భాగమైన మైనార్టీలపై ఎందుకు దాడులకు తెగబడ్డారో చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో వైద్య కళాశాలల నిర్మాణం చేపడితే, నేడు ఆ కళాశాల నిర్మాణాలను ప్రైవేటీకరణ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మంత్రి సవిత నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షిస్తే, వైద్య కళాశాల ప్రైవేటీకరణ ఆపాలన్నారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్జేడీ శామ్యూల్



శిక్షణకు హాజరైన సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు

పుట్టపర్తి: రెగ్యులర్, ఓపెన్ పదో తరగతి పరీక్షలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ ఆదేశించారు. మంగళవారం బుక్కపట్నం డైట్ కళాశాల ఆర్డీటీ సమావేశపు భవనంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమంలో డీఈఓ కృష్ణప్పతో కలిసి పాల్గొన్న ఆర్జేడీ శామ్యూల్ మాట్లాడుతూ... పదో తరగతి పరీక్ష నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. పరీక్ష నిర్వహణలో ఎక్కడా తప్పిదాలు దొర్లకూడదన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖ అధికారి పద్మ ప్రియ, ఏడీలు రామకృష్ణ, లాజర్, టీసీఈబీ భాస్కర్‌రెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. గావుల మహోత్సవం



పోతలయ్యస్వామి గావుల మహోత్సవంలో భక్త జనసందోహం



పోతలయ్యస్వామికి గావులు పట్టేందుకు నృత్యాలు చేసుకుంటూ వస్తున్న పోతురాజులు



పోతలయ్యస్వామి మూలవిరాట్

- దాదులూరు పరువులో భక్తజన సందోహం

కనగానపల్లి: ఉరుముల శబ్దాలు, పోతురాజుల నృత్య విన్యాసాలు, భక్తుల కోలాహలం మధ్య దాదులూరు పోతలయ్యస్వామి గావుల మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామి కాపులు, భక్తులు వేకువజామునే ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి బోనాలు సమర్పించారు. అనంతరం ఉరుముల శబ్దాలకు అనుగుణంగా పోతురాజులు నృత్య విన్యాసాలు చేసుకుంటూ ఆలయంలోకి వచ్చారు. ఆలయ పూజార్లు పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య 11 మంది పోతురాజులు మేకపోతు పిల్లలను స్వామికి గావుల (బలి) మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులు ఆలయం ముందు వందలాది పొట్టేళ్లు, మేకపోతులను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



పోతలయ్యస్వామి ఆలయ ఆవరణలో నారికేళాలు సమర్పిస్తున్న భక్తులు

లక్షమంది రాక

పోతలయ్యస్వామి గావుల మహోత్సవాన్ని తిలకించేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావటంతో పోతలయ్యస్వామి ఆలయ ఆవరణమంతా కిక్కిరిసిపోయింది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు సుమారు లక్ష మంది వరకు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఆగ్రో ఫాం ముసుగులో అడ్డగోలు దందా

- 'నంది ఫాం రిసార్ట్స్'లో నిబంధనల ఉల్లంఘన
- అనుమతులు లేకుండానే నిర్మాణాలు
- నోటీసులు జారీ చేసిన తహసీల్దార్



చోళసముద్రం వద్ద ఉన్న నంది ఫాం రిసార్ట్స్

లేపాక్షి: రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరి తెగిస్తున్నారు. సంపాదనే లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే యథేచ్ఛగా వ్యాపారం చేస్తున్నారు. అగ్రి ఫాం (వ్యవసాయ క్షేత్రం) ముసుగులో 'రియల్' దందా నడుపుతున్నారు. ఇలాంటి బాగోతమే తాజాగా లేపాక్షి మండలం చోళసముద్రంలో వెలుగు చూసింది. ప్రభుత్వ నిబంధనలేవీ పాటించకుండా, అధికారుల నుంచి అనుమతులు లేకుండా రిసార్ట్ ఏర్పాటు చేశారు. దీన్ని మంగళవారం తనిఖీ చేసిన తహసీల్దార్ సౌజన్యలక్ష్మి అక్కడి వ్యవహారం చూసి కంగుతిని.. రిసార్ట్ యజమానికి నోటీసులు జారీ చేశారు.

ఆగ్రో ఫాం అంటూ...

లేపాక్షికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో కొడికొండ- శిర మార్గంలో చోళసముద్రం గ్రామ సర్వే నంబర్ 333-9లో మొత్తం 14 ఎకరాల భూమిలో నింబస్ గ్రూప్ ఆధ్వర్యంలో 'నంది ఫాం రిసార్ట్' ఏర్పాటు చేశారు. ఇందులో 51 సెంట్ల విస్తీర్ణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా, ల్యాండ్ కన్వర్షన్ కూడా చేసుకోకుండానే క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, పార్టీ హాల్, పార్కింగ్ ఏరియా, వసతి గదులను అధునాతనంగా నిర్మించారు. మిగిలిన భూమిలో కూడా కన్వర్షన్ లేకుండానే రోడ్లు, ప్రహరీలు, లైటింగ్స్ ఏర్పాటు చేశారు.

ప్లాట్లుగా విభజించి విక్రయాలు

వ్యవసాయ భూమిని కొనుగోలు చేసిన రియల్టర్ ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే 25 నుంచి 50 సెంట్ల వరకు విస్తీర్ణంలో ప్లాట్లు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. ప్లాటు విస్తీర్ణాన్ని బట్టి రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల దాకా విక్రయిస్తున్నారు. బెంగళూరు, ఇతర ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, వ్యాపారులు ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ భూమిగానే చూపుతూ రిజిస్టర్ చేయిస్తుండడంతో కొనుగోలుదారులు ప్రభుత్వ పథకాలకు సైతం అర్హత పొందుతున్నారు. రిసార్ట్ ఏర్పాటులో నిబంధనలేవీ పాటించకపోవడంతో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి నోటీసులు అందజేశారు. వెంటనే వివరణ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించారు.



నంది ఫాం రిసార్టులోని సౌకర్యాలను తెలిపే బోర్డు

క్లుప్తంగా

వేసవి జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరచండి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం



పీహెచ్‌సీలో గదులను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం

చెన్నేకొత్తపల్లి: ప్రస్తుత వేసవిలో ఎండ ప్రభావం తీవ్రంగా ఉండనుండడంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్య పరచాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజాబేగం ఆదేశించారు. మంగళవారం సీకేపల్లిలో ఆమె పర్యటించారు. మురుగునీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎన్ఎస్‌గేట్‌లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బంది వివరాలు, మందుల నిల్వలపై ఆరా తీశారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఎలా చేస్తున్నారంటూ వైద్యాధికారి డాక్టర్ రవినాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెరగాలన్నారు. రాత్రి సమయాల్లో రోగులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొన్న మద్యం

అమడగూరు: మద్యం సేవించిన కాసేపటికే ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... అమడగూరు మండలం జేకేపల్లికి చెందిన గుడిసిపలిల గంగులప్ప (55) మంగళవారం ఉదయం గ్రామంలోని బెల్టుషాపులో మద్యం బాటిల్ కొనుగోలు చేసి అక్కడే తాగాడు. కాసేపటి తర్వాత అపస్మారకస్థితికి చేరుకోవడంతో బెల్ట్‌షాపు నిర్వాహకుడి సమాచారంతో కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే మరణించినట్లు నిర్ధారించుకుని బోరున విలపించారు. కాగా, అతిగా మద్యం సేవించి మృతి చెందాడా? లేదా కల్తీ మద్యం ప్రభావంతో మరణించాడా? అనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి.

దుకాణం దగ్ధం



కాలిపోయిన నోట్లు

తనకల్లు: మండలంలోని ఏనుగుగుండుతండాలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ కిరాణా దుకాణం దగ్ధమైంది. తండాకు చెందిన రమణానాయక్ మంగళవారం తన కిరాణా దుకాణానికి తాళం వేసి బోరు బావి వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో దుకాణంలో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. దుకాణంలో నుండి దట్టమైన పొగ బయటకు వస్తుండడంతో గమనించిన స్థానికుల సమాచారంతో రమణానాయక్ అక్కడకు చేరుకున్నాడు. స్థానికుల సాయంతో తలుపులను బద్దలుగొట్టి మంటలను ఆర్పి వేశారు. ఇతరులకు ఇచ్చేందుకు దుకాణంలోని ఓ పెట్టిలో ఉంచిన రూ. 3 లక్షల నగదుతో పాటు రూ.లక్ష విలువైన సరుకులు కాలిపోయాయి.

రంజాన్ మాసంలో మద్యం తాగొద్దన్నందుకు...



మృతుడు షేక్ మహబూబ్ బాషా

బత్తలపల్లి: 'పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఉండకపోయినా పర్వాలేదు. మద్యం మాత్రం తాగొద్దు' అని కుటుంబసభ్యులు చెప్పడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బత్తలపల్లికి చెందిన షేక్ జిలాన్ సాహెబ్ కుమారుడు షేక్ మహబూబ్ బాషా(30)కు భార్య భానుబేగం, నాలుగేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. బత్తలపల్లి కూడలిలో పాన్‌షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన మహబూబ్‌బాషా రోజూ వ్యాపారం ముగించుకుని ఫుల్‌గా మద్యం సేవించి ఇంటికి చేరుకునేవాడు. ఆ సమయంలో కుటుంబసభ్యులు నిలదీస్తే భార్యతో గొడవపడేవాడు. మద్యం తాగొద్దంటే తాను చనిపోతానని బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆలస్యంగా ఇంటికి చేరుకున్న మహబూబ్‌బాషాను భోజనానికి రావాలని భార్య పిలిచింది. అయితే తనకు భోజనం వద్దని తాను మద్యం తాగి వచ్చినట్లుగా తెలిపాడు. దీంతో అసహనానికి గురైన భార్య 'నీవు మారవు. మా బతుకులు ఇంతే. కనీసం రంజాన్ మాసంలోనైనా ఉపవాస దీక్ష లేకపోయినా పర్వాలేదు... మద్యం మాత్రం తాగొద్దు' అంటూ హితవు పలికి, ఏడుస్తున్న తన నాలుగేళ్ల వయసున్న కుమారుడిని ఎత్తుకుని సముదాయిస్తూ ఇంటి బయటకు వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న మహబూబ్ బాషా.. తన కుమారుడి కోసం ఊయలగా వేసిన చీరతో ఉరి వేసుకున్నాడు. అదే సమయంలో ఇంట్లోకి వచ్చిన భానుబేగం కేకలు వేస్తూ ఎదిరింట్లో ఉన్న అత్తామామలను అప్రమత్తం చేసింది. కుటుంబసభ్యులందరూ కలసి మహబూబ్ బాషాను కిందకు దించి ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మహబూబ్‌బాషా మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నెలాఖరులోపు టార్గెట్ పూర్తి కావాలి

- మార్కెటింగ్‌శాఖ ఆర్జేడీ రామాంజినేయులు ఆదేశం



ఏడీఎంలు, సెక్రటరీలతో సమావేశమైన రామాంజినేయులు

అనంతపురం అగ్రికల్చర్: నెలాఖరులోపు నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) సి.రామాంజినేయులు ఆదేశించారు. జిల్లాకు వచ్చిన ఆయన మంగళవారం స్థానిక మార్కెటింగ్‌శాఖ కార్యాలయంలో రెండు జిల్లాల ఏడీఎంలు పి.సత్యనారాయణచౌదరి, ఎల్ఎన్ మూర్తితో కలసి మార్కెట్ కమిటీ ఆదాయ వనరులపై సెక్రటరీలు, సూపర్‌వైజర్లతో సమీక్షించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫీజు వసూళ్లలో రెండు జిల్లాలు నిర్దేశించిన శాతానికన్నా ఎక్కువ ప్రగతి సాధించాలన్నారు. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది రూ.12.06 కోట్లకు గానూ 82 శాతంతో రూ. 9.97 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో రూ.5.31 కోట్లకు గానూ 82 శాతంతో రూ.4.37 కోట్లు సాధించినట్లు తెలిపారు. రాప్తాడు, ఉరవకొండ, గుంతకల్లు, ధర్మవరం, హిందూపురం కమిటీలు వెనుకబడినందున ఆర్థిక సంవత్సరం ముగిసే ఈ 25 రోజుల్లో ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. పశువులు, జీవాలు, మిరప, చింతపండు, చీనీ మార్కెట్లలో లీకేజీలు అరికట్టాలని, రెన్యువల్స్, గోదాముల అద్దెలు పూర్తి స్థాయిలో వసూలు చేయాలని ఆదేశించారు. మార్కెట్ కమిటీల్లో ఇతర అభివృద్ధి కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే 2025–26కు సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. ఈ ఏడాది కన్నా వచ్చే ఏడాదికి టార్గెట్లు పెంచుకుని లక్ష్య సాధనకు గట్టిగా పనిచేయాలని సూచించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చొరవ తీసుకోండి

- ఎస్పీ రత్న ఆదేశం

పుట్టపర్తి టౌన్: ఈ నెల 8న జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకోవాలని సిబ్బందిని ఎస్పీ రత్న ఆదేశించారు. మంగళవారం డీపీఓ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఆమె మాట్లాడారు. రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో ఇరుపక్షాల సమ్మతితో వారి కేసులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ తీసుకున్న సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు.

జూదరుల అరెస్ట్

కదిరి అర్బన్: మండలంలోని ముత్యాలచెరువు వద్ద పేకాట ఆడుతున్న ఆరుగురుని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,05,500 నగదు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు చేపట్టి జూదరులను అరెస్ట్ చేసినట్లు వివరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: స్థానిక సత్యనారాయణపేటకు చెందిన ఇంద్రనాథ్‌గుప్తా (55) హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఒకటో ప్లాట్‌ఫారమ్ నుంచి రెండో ప్లాట్‌ఫారమ్ వైపుగా పట్టాలు దాటుతుండగా బెంగళూరు నుంచి వస్తున్న వందే భారత్ రైలు ఢీకొని మృతి చెందాడు. మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. బరువు ఎక్కువగా ఉన్న ఆయన ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఎక్కలేక పట్టాలు దాటే ప్రయత్నం చేశాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

వృద్ధుడి ఆత్మహత్య

హిందూపురం: మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన బి.అంజినప్ప(60) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన అంజినప్ప వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. రోజూ తన రేషం షెడ్డు వద్ద పడుకునేవాడు. ఈ క్రమంలోనే ఒంటరి తనాన్ని తాళలేక మంగళవారం రేషం షెడ్డులోనే పైకప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న హిందూపురం రూరల్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


కర్ణాటక మద్యం స్వాధీనం




పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

హిందూపురం టౌన్: హిందూపురం ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో దాడులు చేసి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోచనపల్లి నుంచి హిందూపురానికి వెళ్లే రహదారిలో పెన్నా నది బ్రిడ్జి వద్ద మంగళవారం చాకలికుంటకు చెందిన రాకేష్ వద్ద నుంచి 11 బాక్సుల్లోని 1059 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామన్నారు.

పీజీ తెలుగు పాఠ్యాంశంగా 'తడియారని స్వప్నం'



రచయిత లోసారి సుధాకర్



తడియారని స్వప్నం ముఖ చిత్రం

అనంతపురం: ప్రముఖ కవి లోసారి సుధాకర్ రచించిన 'తడియారని స్వప్నం' కవితా సంపుటిని ఎస్కేయూ ఎంఏ తెలుగు కోర్సులో పాఠ్యాంశంగా చేర్చారు. 2025–26 విద్యాసంవత్సరం నుంచి 2027–28 విద్యా సంవత్సరం వరకూ ఈ పాఠ్యాంశం ఉంటుంది. ఈయన ప్రస్తుతం విజయవాడ ఏసీబీ అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఆయన రచించిన మొదటి కావ్యం 'మైనపు బొమ్మలు' సైతం ఎస్కేయూతో పాటు యోగివేమన వర్సిటీ, రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగు పాఠ్యాంశంగా చేర్చిన విషయం తెలిసిందే. తడియారని స్వప్నం కవితా సంపుటిలో వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ, స్త్రీ దృక్కోణం, దళిత స్పృహ అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. కాగా, శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం కర్ణాటక నాగేపల్లికి చెందిన లోసారి సుధాకర్ ఎస్కేయూలో 1990–92 బ్యాచ్‌లో ఎంఏ పొలిటికల్ సైన్స్ పూర్తి చేశారు. పొలిటికల్ సైన్స్ చదివినప్పటికీ, తెలుగు సాహిత్యం, కవిత్వంపై మంచి పట్టు ఉంది. అనేక కవిత్వాలు, గ్రంథాలు రచించారు.

ప్రేమ తెచ్చిన తంటా... జైలుపాలైన విద్యార్థి

రాప్తాడు రూరల్: ప్రియురాలిపై హత్యాయత్నం చేసిన కేసులో ఎస్కేయూ పీజీ విద్యార్థి జైలు పాలయ్యాడు. ఇటుకలపల్లి పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలానికి చెందిన కురుబ బ్యాళ్ల విష్ణువర్దన్ ఎస్కేయూలో ఎంఎల్ఐసీ చదువుతున్నాడు. ఈ క్రమంలో ఎస్కేయూలో బీటెక్ చేస్తున్న అనంతపురం రూరల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో పరిచయమై, ప్రేమకు దారితీసింది. ఇద్దరూ సన్నిహితంగా ఉన్న సమయంలో ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. కొంత కాలంగా ఆమె స్వగ్రామానికి చెందిన మరో యువకుడితో చనువుగా ఉంటోందన్న అనుమానంతో విష్ణువర్దన్ రగిలిపోయాడు. ఫిబ్రవరి 27న యువతిని ఓ గదికి తీసుకెళ్లి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా వారిద్దరూ చనువుగా ఉన్న సమయంలో తీసుకున్న ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశాడు. ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఇటుకలపల్లి పోలీసులు... అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు నేతృత్వంలో దర్యాప్తు వేగవంతం చేశారు. మంగళవారం ఉదయం పూలకుంట గ్రామ శివారులోని కురుబ తిమ్మప్పస్వామి గుడి వద్ద తచ్చాడుతున్న నిందితుడు బ్యాళ్ల విష్ణువర్దన్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. అతడి నుంచి ఓ ద్విచక్ర వాహనంతో పాటు మూడు సెల్‌ఫోన్లు, ఫొటోలు, వీడియోలు ఉన్న పెన్ డ్రైవ్ స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఇంగ్లిష్ పరీక్షకు 514 మంది గైర్హాజరు

పుట్టపర్తి: జిల్లాలోని 42 కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 514 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. జనరల్ విద్యార్థులు 12,162 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 11,749 మంది, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,696 మందికిగానూ 1,595 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి తెలిపారు.

కలుషిత నీరు తాగి గొర్రెల మృతి

బ్రహ్మసముద్రం: కలుషిత నీరు తాగి 24 గొర్రెలు మృతి చెందాయి. వివరాలు.. బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి పంచాయతీ ముద్దలాపురం గ్రామానికి చెందిన ఎరికల రామన్న... గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు లాగే మంగళవారం జీవాలను మేపునకు తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సమీపంలోని తోటలో మొక్కజొన్న పంటకు డ్రిప్ ద్వారా వదిలేందుకు యూరియా కలిపిన నీటిని గొర్రెలు తాగాయి. కాసేపటి తర్వాత ఒకదాని వెనుక ఒకటి చొప్పున మృతి చెందాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కలుషిత నీరు తాగడం వల్లనే గొర్రెలు మృతి చెందినట్లుగా నిర్ధారించారు. ఘటనతో రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

ఎంపీపీ ఆది భూ అక్రమాలపై విచారణ చేపట్టాలి

- గిరిజనులు, ఎస్సీల భూములు ఆక్రమించి అన్యాయం చేశారు
- బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడతాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



సీపీఐ రామకృష్ణ వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత రైతులు

ధర్మవరం: నిరుపేద గిరిజనులు, ఎస్సీలు సాగు చేసుకుంటున్న వందలాది ఎకరాలను ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆక్రమించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అన్నారు. తాను ఆక్రమించిన భూములను బంధువుల పేరిట ఆన్‌లైన్ చేసుకుని ప్రభుత్వ ఫలాలు పొందుతున్న ఆది భూ అక్రమాలపై సీనియర్ ఐఏఎస్ అధికారితో విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ముదిగుబ్బ మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి గ్రామంలో సీపీఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ చేతిలో మోసపోయిన బాధితులు తమ సమస్యలు చెబుతూ సీపీఐ నాయకుల ఎదుట కంటతడి పెట్టారు. తాము తాతల కాలం నుంచి భూములు సాగు చేసుకుంటున్నామని, అప్పట్లో ప్రభుత్వం తమకు పట్టాదారు పాసుపుస్తకాలు సైతం మంజూరు చేసిందన్నారు. కానీ వన్‌బీ, అడంగల్‌లో మాత్రం ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ తన బంధువుల పేర్లు ఎక్కించుకుని తమకు అన్యాయం చేశారన్నారు. స్పందించిన రామకృష్ణ... ఎంపీపీ ఆది నారాయణ యాదవ్ భూఆక్రమణలతో నష్టపోయిన నిరుపేద గిరిజన, ఎస్సీలకు న్యాయం జరగకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. మండలంలో 400 ఎకరాల దాకా ఎంపీపీ చేతిలో భూములు ఉన్నాయని, ఆదినారాయణ యాదవ్ అమాయక రైతులకు అన్యాయం చేస్తుంటే మంత్రి సత్యకుమార్ మౌనం వహించడం ఆశ్చర్యమేస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, రాష్ట్రానికి మంత్రిగా ఉన్న సత్యకుమార్ సొంత నియోజకవర్గంలో ఉన్న బాధితులకు న్యాయం చేయడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈనెల 7న రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి బాధితులకు న్యాయం చేసి భూయాజమాన్య హక్కులు కల్పించేలాగా చర్యలు చేపట్టాలని కోరతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాటమయ్య, చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, రవి, రమణ, శ్రీరాములు, సంతోష్‌కుమార్, బండల వెంకటేశ్, లక్ష్మీనారాయణ, వెంకటనారాయణ, వెంకటస్వామి, శ్రీనివాసులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



నాటుసారా మత్తులో రోడ్డు పక్కనే పడిపోయిన మందుబాబులను లేపుతున్న స్థానికులు



నవోదయం 2.0 సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటసన్యాసిశర్మ

ఇదెక్కడి నవోదయం?!

కదిరి అర్బన్: ప్రతి కార్యక్రమానికి రెండు కోణాలు ఉంటాయని పెద్దలు అంటుంటారు. అలాగే నవోదయం 2.0 కార్యక్రమానికి రెండో కోణం కదిరిలో బహిర్గతమైంది. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నవోదయ 2.0 సమావేశం ఏర్పాటు చేశారు. నాలుగు గోడల మధ్య అధికారులందరూ సమావేశమై నాటుసారా అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. అయితే అదే సమయంలో సమావేశం జరుగుతున్న భవనానికి కూతవేటు దూరంలో కొందరు ఫుల్‌గా నాటుసారా సేవించి రోడ్డు పక్కనే మత్తులో పడిపోయారు. మరికొందరు తూలుతూ వాహనాల కిందపడి గాయాలపాలయ్యారు. ఇదంతా గమనించిన పలువురు 'అయ్య బాబోయ్ ఇదెక్కడి నవోదయం' అంటూ చర్చించుకోవడం గమనార్హం.